సంకీర్తన వైభవం



చిక్కడపల్లి: ఎస్‌ఏఎస్‌ఎస్వీ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన మహాయజ్ఞం త్యాగరాయ గానసభలో కొనసాగుతోంది. సంకీర్తనాచార్య వెంకటేశ్వర్లు, కోటపాటి గోవిందదాస తన శిష్య బృందంతో మంగళవారం కీర్తనలను శ్రావ్యంగా గానం చేశారు. అనురాధ పర్యవేక్షణ జరిగిన కార్యక్రమంలో ప్రముఖులు కె.కృష్ణమాచారి, జ్యోతి, లక్ష్మీకాంత్, బద్రీనాథ్‌కు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికలతో సన్మానించారు.

తవ్విన రోడ్డును త్వరగా నిర్మించండి



ఏఈ మనీషాకు సమస్యను వివరిస్తున్న బీజేవైఎం కన్వీనర్ సునీల్

అంబర్‌పేట: రోడ్డు కోసం తవ్విన రోడ్డును తక్షణమే నిర్మించాలని బీజేవైఎం అంబర్‌పేట అసెంబ్లీ కన్వీనర్ సునీల్, బస్తీ నాయకులు మల్లేశ్ జీహెచ్‌ఎంసీ ఏఈ మనిషాకు వినతి పత్రం అందజేశారు. గోల్నాక డివిజన్ అంబేడ్కర్‌నగర్‌లో 3నెలల క్రితం కొత్త రోడ్డు వేయడానికి తవ్వారు. స్థానికులు గత మూడు నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గోల్నాక డివిజన్ ఏఈ మనిషాను మంగళవారం వార్డు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. తక్షణమే రోడ్డును నిర్మాణ పనులు చేపట్టాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు.

విరిగిపడిన చెట్ల కొమ్మల తొలగింపు



ప్రేమ్‌నగర్‌లో కొమ్మలను తొలగింపజేస్తున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

అంబర్‌పేట: డివిజన్ పరిధిలో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం వాటిని తొలగింపజేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నూతన సీఎస్‌ను కలిసిన బీసీ సంఘం నేతలు

ఉస్మానియా యూనివర్సిటీ: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ నేతృత్వంతో బీసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ నూతన సీఎస్ కె.రామాకృష్ణారావును సచివాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని వినతి పత్రం అందించినట్లు తెలిపారు. ఫీజు బకాయిల విడుదలలో తీవ్ర జాప్యం వలన ప్రైవేట్ కాలేజీల్లో డిగ్రీ పరీక్షలను యజమానులు బహిష్కరించారని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. బూర శ్రీనివాస్‌గౌడ్, గోదా రవీందర్ పాల్గొన్నారు.

'మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోవాలి'

ఉస్మానియా యూనివర్సిటీ: మావోయిస్టులు ఆయుధాలు వీడి లొంగిపోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రామచర్ల రాంబాబు అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట మావోయిస్టుల దిష్టిబొమ్మను మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట అమాయకపు గిరిజన ప్రజలను చంపుతున్నారని, మావోయిస్టులతో చర్చలు జరపాలని సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ కోరడం విచారకరమన్నారు. తుపాకీ ద్వారా రాజ్యాధికారం వస్తుందని తప్పుడు సిద్ధాంతంతో ఇంత కాలం అనేక మంది పోలీసులను, ప్రజాప్రతినిధులను, అధికారులను, ఇన్ఫార్మర్ల పేరిట సామాన్య ప్రజలను హతమార్చిన మావోయిస్టుల ఉద్యమం చివరకు బలహీన పడిందన్నారు. కేంద్ర బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరుగుతున్న యుద్ధంలో పోలీసులు పై చేయి సాధించగానే వారు శాంతి చర్చల జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అభివృద్ధికి అడ్డుగా ఉన్న మావోయిస్టులను ఏరివేస్తున్న కేంద్ర బలగాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వితేజ, జాతీయ కార్యవర్గ సభ్యులు జీవన్ పాల్గొన్నారు.

ఇప్పటికైనా కళ్లు తెరవండి

స్లీప్ మోడ్‌లో సీసీ కెమెరాలు!

నిఘా నేత్రాలను పట్టించుకోండి

కాచిగూడ డివిజన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పనిచేయని మెజార్టీ సీసీ కెమెరాలు

సీసీ కెమెరాలు పని చేయకపోవడంతో ప్రధాన కేసుల్లో లభించని ఆధారాలు

శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రజల భద్రత కల్పించేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. గొడవలు, దొంగతనలు, రోడ్డు ప్రమాదాల దర్యాప్తుల్లో కీలక పాత్ర పోషించే కెమెరాలు నిద్రపోతున్నాయి. అంబర్‌పేట నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు మరమ్మతులకు నోచుకోవడంతో లేదు. గొడవలు, దొంగతనాల కేసుల దర్యాప్తులో ఆధారాలు సంపాదించకపోవడంతో బాధితులకు న్యాయం జరగడం లేదు. కేసుల దర్యాప్తులో కీలకమైన సీసీ కెమెరాలు పనిచేయకపోయినా పోలీసు శాఖ పట్టించుకోవడం లేదు. 'ఒక్క సీసీ కెమెరా.. వంద మంది పోలీసులకు సమానం'అని చెప్పే పోలీసు ఉన్నతాధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు నిర్లక్ష్యం వీడి పాడైపోయిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొస్తారో లేదో వేచి చూడాలి.

అంబర్‌పేట: కాచిగూడ డివిజన్ పరిధిలోని అంబర్‌పేట, కాచిగూడ పోలీసుస్టేషన్ల పరిధిలో సీసీటీవీ కెమెరాలు దాదాపుగా పని చేయడం లేదు. ప్రధాన కూడళ్లతో పాటు కీలక రోడ్లు, కాలనీల్లోని సీసీ కెమెరాలు అంతంతా మాత్రమే పని చేస్తున్నాయి. నేను సైతం పథకం కింద గత ఐదారేళ్ల క్రితం పెద్ద ఎత్తున అవగాహన కల్పించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక పోలీసు స్టేషన్ పరిధిలో దాదాపు 3వేల నుంచి 5వేల కెమెరాలు ఏర్పాటు చేశారు. కెమెరాల్లో రికార్డు అయ్యే ఫుటేజీ హార్డ్‌డిస్క్‌లలో భద్రపరిచేలా ఏర్పాట్లు చేశారు. నేను సైతం పరిధిలో పౌరులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే... ప్రధాన కూడళ్లు, రోడ్లలో పోలీసు విభాగం ఏర్పాటు చేసింది. ఎవరు ఏర్పాటు చేసినా పర్యవేక్షించాల్సిన పోలీసు విభాగం వాటిని పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

మరమ్మతుకు గురైతే అంతే సంగతులు..

పోలీసు స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేసేటప్పుడు ఉన్న ఆసక్తి వాటి నిర్వహణపై ఉండటం లేదు. సీసీ కెమెరాలు మరమ్మతులకు గురైతే వాటిని ఎవరూ పట్టించుకోవడం లేదు. చిన్నచిన్న మరమ్మతులను కూడా చేయకపోవడం గమనార్హం. ఈదురు గాలులు, చెట్ల కొమ్మలు విరిగి పడటం, స్తంభాలు పడిపోయిన సందర్భాల్లో సీసీ కెమెరాలే ముందు ధ్వంసం అవుతున్నాయి. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా వాటిపై దృష్టి సారించడం లేదు. సంఘటన జరిగినప్పుడే సీసీ కెమెరా గుర్తుకు వస్తుందే తప్ప సాధారణ సమయంలో వాటిని పట్టించుకోవడం లేదు.

ఈ కేసుల్లో ఆధారాలు లభించలేదు..

అంబర్‌పేట, కాచిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో కీలక కేసుల్లో ఆయా ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పోలీసులకు ఆధారాలు లభించలేదు. అంబర్‌పేట సాయిబాబాకాలనీలో జరిగిన డబుల్ మర్డర్ కేసులో 10 బృందాలు... 100 మంది పోలీసులు నెల రోజులు దర్యాప్తు చేసినా నేటికీ కేసును చేధించలేదు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉన్నా పని చేయకపోవడంతో పోలీసులకు సరైనా ఆధారాలు లభించలేదు.

◆ వారం క్రితం కాచిగూడ పోలీసు స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన చోరీ కేసులో సైతం సరైన సీసీ ఫుటేజీ పోలీసులకు లభించలేదు. దీంతో కేసు దర్యాప్తులో తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేద్దామని సీసీ కెమెరాల ఫుటేజీ కోసం వెళ్తే అవి పని చేయడం లేదని పోలీసులు గుర్తిస్తున్నారు. దీంతో బాధితులకు న్యాయం చేయడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పని చేయని సీసీ కెమెరాలను పోలీసులే గుర్తించినా వాటికి మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రజల సహకారం తీసుకుంటాం

'నేను సైతం'కార్యక్రమంలో భాగంగా ప్రజలు సీసీ కెరెరాలను ఏర్పాటు చేసుకునేలా మరింత అవగాహన కల్పిస్తాం. ప్రతి ఒక్కరి భద్రతకు దోహదపడే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ప్రజలు ముందుకొస్తే తాము సహకరిస్తాం. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోతే వాటికి దశలవారీగా మరమ్మతులు చేపడుతున్నాం.

– బాలస్వామి, ఈస్ట్ జోన్ డీసీపీ





అంబర్‌పేట ప్రధాన రోడ్డులోని ఓ స్తంభానికి వేలాడుతున్న సీసీ కెమెరా

హరినామ సంకీర్తనలకు అవకాశమివ్వాలి

● అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామీజీ
● జానపద, సంప్రదాయ కళాకారులు సిద్ధంగా ఉన్నారని వెల్లడి



ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద భజన కార్యక్రమంలో హైందవ భక్తి కళా సమ్మేళనం నేతలు

కవాడిగూడ: యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆవరణలో (తిరుపతి తరహాలో) హరినామ సంకీర్తన నిర్వహణకు ప్రభుత్వం వెంటనే భజన బృందాలకు అవకాశాలు ఇవ్వాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామీజీ అన్నారు. తెలంగాణలో సాంప్రదాయ శాస్త్రీయ కళారీతులు, జానపద కళారూపాల ద్వారా హరినామ సంకీర్తనల ప్రదర్శనల నిర్వహణకు కళాకారులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భజన కళాకారులకు హైందవ భక్తి కళా సమ్మేళనం సోమవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద భజన కార్యక్రమం నిర్వహించారు.

◆ ఈ సందర్భంగా విజయశంకర స్వామీజీ మాట్లాడుతూ... యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో అఖండ హరినామ సంకీర్తనకు దేవస్థానం అనుమతి ఇవ్వడం లేదన్నారు. తెలంగాణలో సనాతన సంస్కృతి సంప్రదాయాలను ప్రతి ఒక్కరిలో పెంపొందించడానికి హరినామ సంకీర్తనలు ఉపయోగపడతాయని అన్నారు. శాస్త్రీయ కళారూపాలైన కూచిపూడి, భరతనాట్యం, పేరిని, త్యాగరాజ కీర్తనలు, అన్నమయ్య కీర్తనలలో తాళం భజన, పండరి భజన, కోలాటం, చెక్క భజనలను కళాకారులతో ప్రధాన ఆలయాల పరిసరాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

◆ జానపద కళారూపాలైన బుర్రకథ, తోలుబొమ్మలాట, కర్రసాము,కొమ్ము బుర్రలు, ఒగ్గుకథ, ఒగ్గుడోలు, గొల్ల సుద్దులు, చెక్కభజన, యక్షగానం, చిందు బాగోతం, పల్లె సుద్దులు, డబ్బులు తదితర కళారూపాల్లో స్వామివారిని కొలుచుకుంటూ కళారూపాల ప్రదర్శనలు ఇవ్వడానికి వేల కళాకారులు సిద్ధంగా ఉన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని కళా బృందాలే కాకుండా ఇతర రాష్ట్రాల కళాకారుల కళాబృందాలు ప్రదర్శనలు ఇవ్వడం కోసం సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వెంటనే దేవాదాయ శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి వీటిని నిర్వహించేలా పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అన్నమయ్య కళాక్షేత్ర ఉపాధ్యక్షుడు ఎస్. మారన్న తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో తాగునీటి సరఫరాను మెరుగుపరచండి

అధికారులను ఆదేశించిన కార్పొరేటర్ పావని



గాంధీనగర్‌లోని బస్తీలలో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని బస్తీలలో తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వాటర్‌వార్క్స్ అధికారును ఆదేశించారు. మంగళవారం డివిజన్‌లోని వాల్మీకినగర్, వీవీగిరి నగర్, ఎస్సార్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో బస్తీవాసులు, నేతలతో కలసి ఆమె పర్యటించారు. బస్తీలలో లో-ప్రెషర్‌తో తాగునీరు సరఫరా అవుతోందని బస్తీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఇప్పటికే అనేకసార్లు సమస్యను వివరించినా ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే వాటర్‌వర్క్స్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, వీఎస్టీ రాజు, మహమూద్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

చిక్కడపల్లి: జీహెచ్‌ఎంసీలో రాంకీ గుత్తాధిపత్యం కొనసాగుతోందని బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎస్.మల్లేశం మండిపడ్డాడు. భాగ్యనగర్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ (బీఎంయూ) ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో సమావేశం జరిగింది. బీఎంయూ సంఘటన కార్యదర్శి ఏ.శంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బీఎంఎస్ రాష్ట్ర సంఘటన కార్యదర్శి రాంమోహన్, బీఎంయూ అధ్యక్షుడు రాజేశ్వర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. జీహెచ్‌ఎంసీలో కార్మిక, ఉద్యోగులు అనేక సమస్యలతో సతమతవుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు సాగాలని బీఎంయూ నాయకులకు సూచించారు. ఈ సందర్భంగా ఇతర యూనియన్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నందకిషోర్, మల్లికార్జున, దిలీప్‌కుమార్, రామాంజనేయులు, నర్సింగరావు, సత్యనారాయణ, జంగయ్య, అక్బర్, యాదయ్య తదితర నాయకులు తిరిగి బీఎంయూలో చేరారు.



యూనియన్ల నుంచి బీఎంయూలో చేరిన నాయకులతో ఎస్.మల్లేశం, రామ్మోహన్, రాజేశ్వర్, శంకర్

నేడు బాగ్ అంబర్‌పేటలో కన్యకాపరమేశ్వరి జయంతి

నల్లకుంట: ఆర్యవైశ్య సంఘం నల్లకుంట ఆధ్వర్యంలో బుధవారం(నేడు) బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని సంఘం ప్రధాన కార్యదర్శి గజవాడ అంజన్‌కుమార్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. బాబా మందిరం మొదటి అంతస్తులో ఉదయం 9గంటలకు పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశ్రీ లంకశిరామ సుబ్రహ్మణ్యశర్మచే సామూహిక కుంకుమార్చనలు, హారతి, నైవేద్యం నివేదన, అనంతరం ప్రసాద వితరణ ఉంటుందన్నారు. ఈ పూజలో పాల్గొనే ఆర్యవైశ్య మహిళలు పసుపు/ఎరుపు రంగు చీరలు, పురుషులు తెల్లని దుస్తులు ధరించి రావాలని కోరారు.

సబ్‌రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పై దాడిని ఖండిస్తున్నాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైద్రాబాద్ పెద్ద అంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (బొజ్జ తారకం) తెలంగాణ అధ్యక్షుడు జన్ను సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్లాట్ల రిజిస్ట్రేషన్ అక్రమాలపై ఉన్నతస్థాయి అధికారులతో న్యాయ విచారణ చేపట్టి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెబుతుండగానే పి.శ్రీనివాస్ అనే వ్యక్తి సబ్ రిజిస్ట్రార్‌పై చేయి చేసుకోవడం సరి కాదన్నారు. ఈ చర్యలను పూర్తిగా ఖండిస్తున్నమని చెప్పారు. దాడికి పాల్పడిన శ్రీనివాస్‌ను వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోసారి ప్రభుత్వ అధికారులపై దాడులు చేస్తూ అవమానానికి గురిచేసే వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

మాక్ డ్రిల్‌లో విద్యార్థులు పాల్గొనాలి

ఉస్మానియా యూనివర్సిటీ: కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7 నుంచి ప్రారంభం కానున్న సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్‌లో విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా పాల్గొనాలని ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీతేజ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఇటీవల 28 మంది పౌరులను హతమార్చిన ఉగ్రవాదులకు పాక్ అండదండలు ఉన్నాయని పేర్కొన్నారు. పాక్‌తో యుద్ధం అనివార్యం అయితే విద్యార్థులు, యువత సిద్ధంగా ఉండేందుకు ప్రతిఒక్కరూ మాక్ డ్రిల్ శిక్షణ పొందాలని పేర్కొన్నారు.

ఇంకుడు గుంతల నిర్మాణంపై నిర్లక్ష్యం

ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు రంగయ్య



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హైదరాబాద్ నగరంలో వర్షం నీటిని భూమిలోకి ఇంకేలా చేసే ఇంకుడు గుంతల నిర్మాణంపై సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలో జరిగిన విలేకర్ల సమావేశంలో రంగయ్య మాట్లాడారు. వర్షాలు ముంచుకొస్తున్న తరుణంలో నగరంలో భూగర్భ జలాలను పెంచే ఇంకుడు గుంతలు ఎంతో ముఖ్యమైనవని వాటి గురించి ఆలోచించకపోతే ఎలా అని ప్రశ్నించారు. హైద్రాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజీ బోర్డు ఇటీవల నిర్వహించిన సర్వేలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెల్లడయ్యాయని అన్నారు. మూడు వందల చదరపు మీటర్లకు పైగా విస్తీర్ణం కలిగిన 42వేల భవనాలలో ఇంకుడు గుంతలు నిర్మించలేదని తేలడం అత్యంత బాధాకరమని అన్నారు. ఇంకుడుగుంతలు నిర్మించని వారికి వాటర్ ట్యాంక్ సేవలపై డబుల్ చార్జీలు విధిస్తామని అధికారులు హెచ్చరించినా ఆచరణలో ఆ చర్యలు కనిపించడం లేదన్నారు.

బాలల్లో చదువు, ఆటాపాటలపై ఆసక్తిని పెంచాలి



బాలోత్సవం రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపులో మాట్లాడుతున్న డాక్టర్ నళిని

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాలల్లో చదువు పట్ల ఆసక్తిని పెంపొందించాలని ఆ దిశగా కృషి చేస్తున్న తెలంగాణ బాలోత్సవానికి అభినందనలు తెలుపుతున్నానని చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ నళిని అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రెసిడెన్షియల్ సమ్మర్ క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నళిని మాట్లాడుతూ... సృజనాత్మకతతో కూడిన విద్య అందించే దిశగా కృషి చేయాలన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఎస్. సోమయ్య మాట్లాడుతూ... విద్యతో పాటు మానసిక ఆనందాన్ని పెంపొందించడానికి ఆట, పాటలు కూడా అవసరమని అన్నారు. నాటకాలు, నృత్యం, జానపద గేయాలు, కథలు, యోగా, ఆహార నియమాలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలోత్సవం అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు సుజావతి, ఐద్వా జాతీయ నాయకురాలు టి.జ్యోతి, విద్యావేత్త అంకమ్మ, రూప రుక్మిణీ, మమత తదితరులు పాల్గొన్నారు.

బీసీ హాస్టళ్ల మెస్ బిల్లులు చెల్లించాలి



సీఎస్ రామకృష్ణరావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

అంబర్‌పేట: రాష్ట్రంలో బీసీ హాస్టళ్ల మెస్ బిల్లుల బకాయిలు తక్షణమే చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావుకు వినతి పత్రం అందజేశారు. మెస్‌చార్జీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు 7 నెలల నుంచి బకాయి పడ్డాయని సీఎస్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మెస్ బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టళ్లకు వ్యాపారుల వద్ద తీసుకున్న కూరగాయాలు, పప్పులు, గుడ్లు వంటి వాటికి బిల్లులు చెల్లించలేకపోతున్నారని చెప్పారు. యూనివర్సిటీలు, అనుబంధ కళాశాల్లో చదువుకున్న విద్యార్థులకు సకాలంలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీనిపై సీఎస్ సానుకులంగా స్పందించారని ఆయన తెలిపారు.

కష్టపడే వారికే నామినేటెడ్ పదవులు

ముషీరాబాద్ కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్



కవాడిగూడ: కాంగ్రెస్ బలోపేతానికి కష్టపడి పనిచేసే వారికి నామినేటెడ్ పదవులు లభిస్తాయని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ముషీరాబాద్ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, సికింద్రాబాద్ జిల్లా పరిశీలకుడు కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, సహాయ పరిశీలకులు సిద్దేశ్వర్, శోభారాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్ కుమార్ మాట్లాడుతూ... పార్టీ సిద్ధాంతాలు, రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. గత ప్రభుత్వం చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి 16 నెలల్లో చేసి చూపించారన్నారు. ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి నెరవేరుస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటుంటే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు.

◆ బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రత్మక నిర్ణయం తీసుకుందని తెలిపారు. అందువల్లే ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా కులగణనకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. అంబేడ్కర్‌ను పార్లమెంట్ సమావేశాల్లో అవమానించిన కేంద్ర మంత్రి అమిషాపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని అన్నారు. బీజేపీ కుట్రలను తిప్పికొట్టేందుకు దేశవ్యాప్తంగా జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ కార్యక్రమాలను చేపట్టి రాజ్యాంగ హక్కులు, చట్టాలను ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. బీజేపీ రాజకీయ దురుద్దేశంతో రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు.

పదవులు కావాలంటే దరఖాస్తు చేసుకోండి: కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి

త్వరలో జరగనున్న జీహెచ్‌ఎంసీ కార్పొరేషన్ ఎన్నికల్లో సికింద్రాబాద్ జిల్లాలోని 40 డివిజన్ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధించాలని జిల్లా కాంగ్రెస్ పరిశీలకులు కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి సూచించారు. రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలోని ఆరు డివిజన్లలో కాంగ్రెస్ జెండా ఎగిరేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే అధిష్టానం గుర్తిస్తుందన్నారు. పదవులను ఆశించేవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్, కార్పొరేటర్లు ఆర్. కల్పనయాదవ్, వాజీద్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, అంజియాదవ్, వీడీ కృష్ణ, వెంకటేష్, జీఎస్ కేశవ్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.